# ఏకో నారాయణ

"ఈ వూళ్ళోనే వున్నావా నారాయణా, రెండేళ్ళబట్టీ?" అని పలకరించిన రంగనాథం, "రెండేళ్లేం? ఎనిమిదేళ్ళవుతోంది!" అని నేనంటే, "నేనొచ్చి రెండేళ్లే అయిందిలే - దాని మాట" అని సర్దుకున్నాడు. ఉద్యోగం ఎందులోనని అడిగాడు. చెప్పాను, "నా జ్యూరిస్డిక్షనే" అని సంబరపడ్డాడు. "మనం తరుచు కలవాలోయ్," అన్నాడు. మా యిల్లు దగ్గిరే కదాని ఆహ్వానించాను.

"రంగనాథమని-మా క్లాస్మేటు, ఇన్కమ్ టేక్సాఫీసులో పని" అని మా ఆవిడకి పరిచయం చేసేను. ఆవిడ పుణ్యమాని కాసేపట్లో క్లాస్మేటిద్దరం గ్లాస్మేటయ్యాం, కాఫీలతో.

"ఇంకా సాహిత్యం, సంగీతం అంటూ టైమూ, డబ్బూ వృధా చేస్తున్నావా?" అన్నాడు రంగనాథం- గోడపక్కని "రాక్"లో వున్న పుస్తకాలని, టేబిలుమీద స్టీరియోసెట్టు, పక్కనే పేర్చున్న ఎల్. పి. ఇ. పి. ఎస్. పి. "78" రికార్డుల దొంతర్లని గమనిస్తూ - పరికిస్తూ- తణీకీ చేస్తూ.

మిగతా వ్యసనాల్లాగే ఇవీ ఓసారి అంటుకుంటే మరి వదలవనీ, ఎటొచ్చీ మానసిక వికాసానికి దోహదం చేస్తాయనీ ఏదో మాట్లాడు తూనే వున్నాను. ఈ లోగానే అతను "అరవై నాలుగు ఎల్. పీ. లు! మంచి కలెక్షనే! అంటే యీ రూపంలో నీ దగ్గిర మూడువేల రూపాయ లున్నాయన్న మాట!" అన్నాడు.

అలాగే పుస్తకాలకీ నాలుగు వేల విలువ కట్టాడు. రంగనాథం నా టేస్టు విషయంలో 'వేలు' పెట్టడం, కట్టడం మా ఆవిడకు నచ్చి నట్టుంది. "ఏమిటోనండీయాన ! కాపరాని కొచ్చిందగ్గిర్నించి చూస్తున్నాను చేతికి ఏ రకం డబ్బొచ్చినా పుస్తకాలూ, రికార్డులే కొంటారుగాని - ఓ మంచి పట్టుచీర లేదు. చేతికి బంగారు గాజులు రెండు జతలైనా లేవు! ఇల్లు మొదటేలేదు. స్థలం అసలే లేదు!" అని వెళ్ళబోసుకుంది.

"ఏం వస్తాయండి, మన్లాటి వాళ్ళకి- వొచ్చేది జీతపు రాళ్ళేగా!" అన్నాడు రంగనాథం, మా ఆవిడ కళ్ళలోకి చూస్తూ.

"మొన్న సీ డీ లిచ్చేరు కదండి. అంతకు ముందు పే కమీషన్ అరియర్స్. కిందటి నెలలో తుఫాను అడ్వాన్సు ! ఐదునెల్ల కితం బోనస్సు!"

"అదా!" అని నవ్వేడు రంగనాథం.

* * *

నాకేదో మెడికల్ రీ ఇంబర్స్‌మెంట్ బిల్ వస్తుందంటే, అది తీసుకుని మా ఎకౌంట్స్ ఆఫీసర్ సంతకంకోసం వెళ్ళేసరికి, ఆయన ఎదటి సీట్లో కాఫీ, సిగరెట్టూ వొకేసారి పీలుస్తూ కనబడ్డాడు, రంగ నాథం మూడు రోజుల తరవాత.

"హలో, నారాయణ! సిడౌన్" అంటూ పక్కకుర్చీ నాకు ఆఫర్ చేసేడు. మా ఎ. ఒ. గారి కెదురుగా నేను కూర్చోనని తెలీక కాబోలు.

"మేం ఆ వివరాలన్నీ పంపిస్తాం సార్" అని రంగనాథానికి

చెప్పి ఎ. ఒ. గారు నా వేపు తిరిగి "ఎస్?" అని నేనందించిన కాగితం మీద సంతకం పెట్టేసి నా వేపు చూడకుండానే నాకందించారు.

* * *

"ఈ నెల మీ ఎకౌంటులో ఏమీ జమ వల్లేదు సార్" అని నా చెక్కు నాకు తిరిగిచ్చేశాడు. బ్యాంకు గుమాస్తా విశ్వం చెక్కుచెదరని ధోరణిలో—

సీలింగుఫాన్ కొనడానికికని బ్యాంకు వాళ్లు అప్పిచ్చేటప్పుడు, నా జీతం ప్రతినెలా బ్యాంకుకే సరాసరి జమకట్టెయ్యడానికి, వాళ్ళు తమ వాయిదా సొమ్ము మినహాయించుకుని మిగతామేరకు నేనెప్పుడు చెక్కు రాసిస్తే అప్పుడు "కాష్" "పే" చెయ్యడానికీ ఒప్పందం జరిగింది. ఈ నెలలో జమే లేదంటున్నాడు........

విచారించేను.

తేలిందేమిటంటే, ఈ నెల నా జీతం ఏడు వందల అరవై మూడు రూపాయలు కూడా ఆదాయపు పన్నుగా పోయిందిట. మిగతాది పైనెలలో పోతుందిట.

"ఇదేమన్యాయం? మీ సంగతి చెబుతా నుండండి!" అని బిల్లు గుమస్తామీద అరిచి, సలహా - సహాయాలకోసం రంగనాథం ఇల్లు వెతుక్కుంటూ వెళ్ళాను.

"కుక్కలున్నవి జాగ్రత్త" అనే బోర్డుచూసి కొంచెం తగ్గాను. పక్కనే వున్న స్విచ్ నొక్కగా మోగిన బెల్లుకి బెల్లువాటం అమ్మాయి చిరుగంటల తెరలను తొలగించుకొచ్చి "రండి" అనడం, కుక్క "భౌ" మంటూ గొలుసుతో కుస్తీపట్టగా, "షటాప్ రాజా" అని ఆమె ఆజ్ఞాపించి నాకు ఇంట్లోకి ప్రవేశం కల్పించడం జరిగాయి.

"నువ్వే అన్నావుగా మనిషికో వ్యసనమని, మానసిక వికాస మని" అన్నాడు రంగనాథం. విస్కీ గ్లాసు ఎత్తిపట్టుకుని, తాగుతున్నా సరిగానే మాట్లాడా దనిపించింది. ఆదాయపు పన్ను కట్టవలసిన వారు ఎవరెక్కడ వున్నా కనిపెట్టడం, వెంటనే పన్ను వూడగొట్టడం వారి విధిట. మార్చి 31 లోగా పన్ను రాలితే వాళ్ళకి ఖ్యాతిట. ఆలస్యంగా

తెలిసినా, మా ఆఫీసులో అన్ని కేసులు దొరుకుతాయని నా ద్వారా తెలిసినందువల్ల నాకు ధన్యవాదా లన్నాడు.

''అది కాదు....ఒక భార్యని నమ్మి సంసారం చెయ్యని ద్రోహి కూడా, ఒక ఆఫీసును నమ్ముకొని బ్రతుకుతాడు కదా; పన్ను అంతా వొక్కసారే లాగేస్తే బాధకదూ; కొంచెం కొంచెంగా వాయిదాలమీద కుదరదా? యెక్కడికి పారిపోతాం?'' అని; దెబ్బలాడడానికి స్థానబలం లేక దేబిరించి సరిపెట్టుకున్నాను. 'అదంతే దాని కపీల్ లేద్!' అని నా 'పన్' సంగతి పట్టించుకోకుండా తీర్పు యిచ్చేసి; గ్లాసులో మిగిలిన ద్రావకాన్ని గొంతుకలో వెలుపుకున్నాడు. ''నేను మూడునెల్ల జీతం టాక్సుకింద కడతాను!'' అన్నాడు.

''మరి ఈ గార్డెనూ, కుక్కా, కాలింగ్ బెల్, ప్రతిగదికీ సోఫా సెట్లూ— యివన్నీ?''

''అవన్నీ మా బావమరుదులు, మామగారు, బాబాయిలు, పిన తల్లులూ, అన్నగారూ ఒద్దన్నా వినకుండా ఏర్పాటు చేస్సేరు; తలో కటీనీ! ఏంచైను?"

అదృష్టవంతుణ్ణి చెరిచేవాడు లేడుగదా అని అనుకుంటూ ఆ పూటకి ఇల్లు చేరాను. మర్నాడు ఆఫీసులో కనుక్కుంటే లక్ష్మీ నారాయణ, రామనారాయణ, శంకరనారాయణ, సత్యనారాయణ, సూర్య నారాయణ, యజ్ఞనారాయణ, వెంకటనారాయణ, అనంతనారాయణ అందరూ ఈ నెల ఇలాగే దెబ్బతిని అల్లో నారాయణా అని గోల పెడుతున్నట్టు తెలిసింది. అయితే, వాళ్ళకెవరికీ స్టీరియోల్లేవు. అంచేత నిశ్శబ్దంగానే గోలెట్టారు.

"నలుగురితో బాటు నారాయణ" అనుకోడానికి నా కెవ్వరూ లేరు.

నేను ఏకో నారాయణ........

(8-4-78)